క్లుప్తంగా

ధనుర్మాస విశేషపూజలు



నకరికల్లు: ధనుర్మాసం సందర్భంగా స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో గురువారం విశేషపూజలు చేశారు. అర్చకులు కొడవటిగంటి మధుసూధనాచార్యులు ఆధ్వర్యంలో ఆలయంలోని శ్రీ ఆదిలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనర్సింహస్వామి వార్లను, గోదాదేవి సమేత రంగానాయకులు స్వామివార్లను సీతారామస్వామివార్లను విశేషంగా అలంకరించారు. ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో ప్రత్యేకపూజలు చేశారు.

శ్రీవారికి దివ్యమంగళ స్వరూప అలంకారం



సత్తెనపల్లి: ధనుర్మాసం పురస్కరించుకొని పట్టణంలోని వడ్డవల్లి రామాలయం వేంకటేశ్వర స్వామి దేవాలయం, రైల్వేస్టేషన్ రోడ్డులోని అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి దేవాలయం, ఐదులాంతర్ల సెంటర్‌లోని రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవాలయం, కట్టమూరివారి వీధిలోని కోదండ రామాలయంలో గురువారం భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. వడ్డవల్లి రామాలయం వేంకటేశ్వర స్వామి దేవాలయంలో 108 రకాల వెరైటీలను స్వామివారికి నివేదించి అనంతరం 108 రకాల ప్రసాదాలు పంపిణీ చేశారు. రైల్వేస్టేషన్ రోడ్డులోని అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శ్రీవారికి దివ్య మంగళ స్వరూప అలంకారం చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఆయా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్య వేక్షించారు.

వైఎస్సార్ సీపీలో చేరిన ఆకుల రామారావు



సత్తెనపల్లి: పట్టణంలోని 31వ వార్డుకు చెందిన ఆకుల రామారావు వైఎస్సార్ సీపీలో చేరారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో ఆకుల రామారావుకు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు గురువారం స్వయంగా పార్టీ కండువాను కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఇటీవల వైఎస్సార్ సీపీ నుంచి తెలుగుదేశం పార్టీలో చేరిన ఆకుల హనుమంతరావుకి రామారావు స్వయానా సోదరుడు కావడం విశేషం. ఈ సందర్భంగ మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ సోదరులైన ఆకుల శివశంకర్, ఆకుల రామారావులు ఇద్దరు సమన్వయంతో స్థానిక నాయకులతో కలిసి వార్డు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు.

విద్యతోనే పేదరికం దూరం

సత్తెనపల్లి: పేదరికం శాశ్వతంగా తరిమికొట్టే సత్తా విద్యకు మాత్రమే ఉందని, అందుకే రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టిందని మండల విద్యాశాఖ అధికారి ఎ.శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని మండల విద్యా వనరుల కేంద్రంలో ఎనిమిదో తరగతి విద్యార్థులకు సంబంధించిన 1,292 ట్యాబులను గురువారం ఇన్‌స్టాలేషన్ పూర్తి చేసి విద్యార్థులకు పంపిణీ చేయాలని ప్రధానోపాధ్యాయులకు అందించారు. ఈ సందర్భంగా ఎంఈఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు మరో మైలురాయి చేరేలా డిజిటల్ విప్లవానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. మండల విద్యాశాఖ అధికారి-2 ఏ.రాఘవేంద్రరావు, ఉపాధ్యాయులు శేషిరెడ్డి, సీఆర్‌పీలు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

గత స్మృతులు ఆనందాన్నిచ్చాయి



నకరికల్లు: గ్రామంతో, గ్రామప్రజలతో తనకున్న ఆత్మీయానుభూతులు మరువలేనివని మాజీ మంత్రి కాసు వెంకటకృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని చాగల్లు గ్రామంలో ఓ కార్యక్రమానికి హాజరైన ఆయన స్థానిక నాయకులతో కలసి మాట్లాడారు. గతంలో నకరికల్లు మండలం నరసరావుపేట నియోజకవర్గంలో ఉన్నపుడు తాను ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేశానన్నారు. నాడు చాగల్లు గ్రామ ప్రజలు తనతో ఎంతో ఆత్మీయంగా ఉండేవారని గుర్తుచేసుకున్నారు. రాజకీయాలకు అతీతంగా గ్రామస్తులతో ఆత్మీయ బంధం ఏర్పడిందని అన్నారు. కాసు వెంకటకృష్ణారెడ్డిని కలసిన వారిలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి, గ్రామసర్పంచ్ అలపర్తి కృష్ణకుమారి శ్రీనివాసరావు, టెలిఫోన్ ఎడ్వయిజరీ కమిటీ డైరెక్టర్ అలపర్తి భాస్కరరావు, కాంద్రు బిక్షమయ్య, రంగయ్య పాల్గొన్నారు.

సంక్రాంతి సంబరం.. ఆనందం అంబరం

- ఉత్సాహంగా సంక్రాంతి ముగ్గుల పోటీలు
- పర్యవేక్షించిన ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, వసంతకుమారి దంపతులు



ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, వసంతకుమారి దంపతులు

అమరావతి: తెలుగువారికి పెద్ద పండుగ సంక్రాంతిని పురస్కరించుకుని గురువారం మండల కేంద్రమైన అమరావతి శ్రీరామకృష్ణ హిందూ హైస్కూల్ ఆవరణలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, వసంతకుమారిల ఆధ్వర్యంలో సంక్రాతి సంబరాలు సాంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు దంపతులు భోగిమంటలు వేశారు.

అనంతరం సంక్రాంతి సాంప్రదాయాలలో ముఖ్యమైన ముగ్గుల పోటీ నిర్వహించారు. ఈ పోటీలలోమండల పరిధిలోని వివిధ గ్రామాలనుంచి 460మంది మహిళలు పాల్గొన్నారు. వారిలో అమరావతికి చెందిన లత వేసిన ముగ్గుకు ప్రథమ బహుమతి రూ. 40వేలు దక్కింది. రెండవ బహూమతి రూ.25వేలు పూజిత, మూడవ బహూమతి రూ.15వేలు లలిత, ప్రత్యేక బహూమతి రూ.10వేలు కొండవీటి సత్యశ్రీ గెలుచుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే నంబూరు శంకరరావు దంపతులు విజేతలకు ప్రైజ్‌మనీతో పాటు బహూమతులు అందచేశారు. అంతేకాకుండా పోటీలలో పాల్గొన్న వారందరికీ కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మాట్లాడుతూ మరుగున పడిపోతున్న తెలుగు సాంప్రదాయాలైన గంగిరెద్దులు, ముగ్గులు, గొబ్బెమ్మలు, మంగళవాయిద్యాలు, హరిదాసుల భజనలు వంటి సాంప్రదాయాలను నేటితరాలు మరిచిపోకుండా గుర్తుచేసి అందరం ఆనందంగా సంక్రాంతి జరుపుకోవాలని ఆకాంక్షించారు. నియోజకవర్గంలో ప్రజలంతా సంక్రాంతి పండుగను సుఖ సంతోషాలతో జరుపుకోవాలని కోరారు. అలాగే జగనన్న పాలనలో ప్రతిఒక్కరూ సంతోషంగా ఉండేవిధంగా అన్నిసంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అందరికీ అందేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఈకార్యక్రమంలో స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు, మండల పరిధి గ్రామాల నుంచి మహిళలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నేడు అచ్చంపేటలో..

అచ్చంపేట: సంక్రాంతి సంబరాలలో భాగంగా ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ హైస్కూలు ఆవరణలో గురువారం మహిళలకు ముగ్గుల పోటీలు జరుగనున్నాయి. మండలవ్యాప్తంగా అన్ని గ్రామాలనుంచి ఉత్సాహ వంతులైన మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనవలసినదిగా జడ్పీటీసీ సభ్యుడు తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి తెలిపారు. పోటీలలో పాల్గొనే మహిళలందరికి బహుమతులుంటాయన్నారు. అదే విధంగా మొదటి నాలుగు స్థానాలలో నిలచిన మహిళలకు రూ.40000, రూ.30000, రూ.20000, రూ.10000లు బహుమతులివ్వనున్నట్లు పేర్కొన్నారు.

రేపు క్రోసూరు మార్కెట్‌యార్డులో...

క్రోసూరు: క్రోసూరు జెడ్పీపాఠశాల ఆవరణలో ఎమ్మెల్యే నంబూరుశంకరరావు, సతీమణి వసంత కుమారి దంపతుల ఆధ్వర్యంలో మండల స్థాయి సంక్రాంతి ముగ్గుల పోటీలు శనివారం జరుగుతాయని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వెలది అప్పారావు గురువారం తెలిపారు. పోటీల్లో పాల్గొనే మహిళలు తమతమ గ్రామంలోని ద్వాక్రా గ్రూపు యానిమేటర్ల వద్దపేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు.

సంప్రదాయానికి ప్రతీకలు రంగవల్లులు..



ముగ్గులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంకరరావు



విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే దంపతులు

పెదకూరపాడు: పెదకూరపాడులో సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, వసంతకుమారి దంపతులు సమక్షంలో పెదకూరపాడులోని జీఆర్‌సీఆర్‌కె చైతన్య స్కూల్‌లో సంబరాలు గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్కృతి, సంప్రదయాలు ఉట్టిపడేలా 500 మంది మహిళలు ముగ్గుల పోటీల్లో పాల్గొన్నారు. ముందుగా ఎమ్మెల్యే దంపతులు భోగి మంటలు వేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం సంక్రాంతి సంప్రదాయంగా కోడి పందెల్లో పాల్గొన్నారు. అనంతరం మహిళలు వేసిన ముగ్గులను పరిశీలించి విజేతలను ప్రకటించారు. నంబూరు వసంతకుమారి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ప్రతిక్షణం ప్రజల సంక్షేమం కోసం పరితపిస్తున్నారన్నారు. ప్రతి ఏడాది ఇలాంటి వేడుకలు ఘనంగా నిర్వహించాలన్నారు. రాబోయే ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే శంకరరావులకు అండగా నిలవాలన్నారు. ముగ్గుల పోటీల్లో మొదటి బహుమతి సాధించిన దుర్గాశ్రీకి రూ.40వేలు, రెండవ బహుమతి పొందిన సారికకు రూ.25వేలు, మూడో బహుమతి పొందిన వాణికి రూ.15వేలు, నాలుగో బహుమతి పొందిన శ్వేతకు రూ.10వేలు, ఐదవ బహుమతి పొందిన మహాలక్ష్మికి రూ.5వేలు నగదు బహుమతిని అందించారు. అనంతరం పోటీల్లో పాల్గొన్న 500మందికి ప్రత్యేక బహుమతులు అందించారు. కులమతలాకు అతీతంగా ఈ వేడుకల్లో మండల ప్రజలు పాల్గొన్నారు. మార్కెట్ యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, జెడ్పీటీసీ కంకణాల స్వర్ణకుమారి, ఎంపీటీసీలు, సర్పంచులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం కేసులో నిందితుడి అరెస్ట్

నరసరావుపేట టౌన్: అక్రమ మద్యం కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి 96 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎస్‌ఐ సురేంద్రబాబు గురువారం తెలిపారు. బాబాపేట రైల్వే గేటు వద్ద బుధవారం రాత్రి తనిఖీలు చేస్తుండగా ద్విచక్రవాహనంపై అక్రమంగా మద్యం తరలిస్తూ వినోద్ పట్టుబడ్డాడన్నారు. బస్టాండ్ వద్ద ప్రభుత్వ మద్యం దుకాణంలో మద్యం కొనుగోలు చేసి అధిక ధరకు విక్రయించేందుకు తరలిస్తుండగా పట్టుబడినట్లు విచారణలో తేలిందన్నారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సుబ్బారావుకు డీటీగా పదోన్నతి

రొంపిచర్ల: మండల తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న కె. సుబ్బారావు డెప్యూటీ తహసీల్దార్‌గా పదోన్నతి పొందారు. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు వచ్చాయి. డీటీగా తిరిగి రొంపిచర్ల తహసీల్దార్ కార్యాలయంలోనే విధులు నిర్వహించాలని ఉత్తర్వులు వచ్చాయి.

ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయం

రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు



వెంగళరెడ్డి నగర్‌లో దుప్పట్లు పంపిణీ చేస్తున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: ఏసుక్రీస్తు బోధనలు సర్వ మానవాళిని సన్మార్గంలో నడిపిస్తున్నాయని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పెదకాకాని మరనాత బైబిల్ మిషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని వెంగళరెడ్డి నగర్‌లోని చర్చిలో నిర్వహించిన కార్యక్రమంలో గురువారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమానికి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబురావు అధ్యక్షత వహించారు. మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ ప్రేమ, కరుణ పదాలకు పర్యాయ పదం ఏసుప్రభు అన్నారు. ఏసుప్రభు ప్రేమ, కరుణకు ప్రతిరూపమని, ఏసు ప్రభువును ప్రార్థిస్తే కష్టాలు, నష్టాలు మటుమాయమై అన్ని శుభాలే కలుగుతాయనే నమ్మకం అందరిలో ఉందన్నారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేశారు. సంఘ కాపరి రెవరెండ్ కిషోర్ ప్రత్యేక ప్రార్థనలు చేసి దైవసందేశాన్ని ఇచ్చారు. అనంతరం 50 మంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, నందిగామ ఎంపీటీసీ రెంటపాళ్ల అక్కేశ్వరరావు, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ బాటలో సీఎం వైఎస్ జగన్



బాబాసాహెబ్ అంబేడ్కర్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న చల్లంచర్ల, కొలిమి షమ్మి

సత్తెనపల్లి: మహాత్మా గాంధీ, బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చూపిన సమ సమాజస్థాపన వైపు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడుగులు వేసి సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు సేవలు అందిస్తున్నారని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు అన్నారు. సామాజిక న్యాయ మహా శిల్పం పేరుతో ఈ నెల 19న విజయవాడలో బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహం ఆవిష్కరించనున్న సందర్భంగా పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో గురువారం బీఆర్ అంబేడ్కర్ నమూనా చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చల్లంచర్ల సాంబశివరావు మాట్లాడుతూ అన్ని వర్గాలకు సామాజిక న్యాయం అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. అంబేడ్కర్ స్మృతివనం ప్రారంభోత్సవంలో ప్రతి ఒక్కరూ పాల్గొని ఆయన మార్గంలో నడవడానికి సిద్ధంగా ఉండాలన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్‌లు షేక్ నాగూర్ మీరాన్, రమావత్ కోటేశ్వరరావు నాయక్, మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి, మేనేజర్ ఎన్.సాంబశివరావు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.మధుసూదన్‌రావు, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ పి.రాఘవరావు, రెవెన్యూ అధికారి ఎంవీ అప్పారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం.విజయసారథి, 21, 22 వార్డుల కౌన్సిలర్లు కాకుమాను రవి, శెట్టి ఆనంద్, నాయకులు ఉన్నారు.

ఓబన్న ఆశయ సాధనకు కృషి



ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వడ్డెర సంఘ నాయకులు

సత్తెనపల్లి: స్వాతంత్ర సమరయోధుడు వడ్డె ఓబన్న ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వడియరాజుల సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు తన్నీరు శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. రేనాటి వీరుడు వడ్డె ఓబన్న 217వ జయంతి వేడుకలు సత్తెనపల్లి వడియరాజుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. జయంతి వేడుకలకు వడియరాజుల సంక్షేమ సంఘ పట్టణ అధ్యక్షుడు వేముల వర ప్రసాదరావు అధ్యక్షత వహించారు. తన్నీరు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి ప్రధాన అనుచరుడిగా వడ్డె ఓబన్న స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటిష్ పాలకుల చేతిలో ప్రాణాలు కోల్పోయారని గుర్తు చేశారు. ముందుగా వడ్డె ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో న్యాయవాది చెంబేటి శివరామకృష్ణ, నాయకులు కె.శివశంకర్, బురుసు శ్రీనివాసరావు, చల్ల శ్రీనివాసరావు, పి.అంకమ్మ, దేవల నాగయ్య, ఒంటిపులి. శ్రీనివాసరావు, మన్యం. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా మండలస్థాయి పోటీలు



నకరికల్లు జెడ్పీ పాఠశాలలో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు



అచ్చంపేటలో క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు విజయప్రతాప్‌రెడ్డి



88త్యాళ్లూరులో క్రికెట్ ఆడుతున్న మహిళలు

నకరికల్లు: స్థానిక జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలు ఉల్లాసభరితంగా సాగుతున్నాయి. ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో భాగంగా మండలస్థాయి పోటీలు గురువారం ఘనంగా నిర్వహించారు. పలుగ్రామాల నుంచి వచ్చిన క్రీడాకారులు ఆయాగ్రామాల తరపున కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీల్లో పాల్గొన్నారు. ఉత్కంఠభరితంగా సాగిన క్రీడాపోటీలను స్థానికులు ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా ఫిజికల్ డైరెక్టర్ చింతా పుల్లయ్య మాట్లాడుతూ మండలస్థాయి కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు శుక్రవారంతో ముగుస్తాయన్నారు. తదనంతరం క్రికెట్‌పోటీలు నిర్వహిస్తామన్నారు. గెలుపొందిన క్రీడాకారులు నియోజకవర్గస్థాయి పోటీల్లో తలపడతారని అన్నారు.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి...

అచ్చంపేట: క్రీడలలో గెలుపోటములను సమానంగా స్వీకరించాలని, గెలిచినవారు పొంగిపోకూడదని, ఓడినవారు కుంగిపోకూడదని జడ్పీటీసీ సభ్యుడు తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి అన్నారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా స్థానిక టీఎస్సార్ జడ్పీ హైస్కూలులో బుధవారం జరిగిన క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారుల నుద్దేశించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాలలో ప్రతిభావంతులైన క్రీడాకారులుంటారని, వారిని ప్రోత్సహించేందుకే సీఎం జగన్‌మోహనరెడ్డి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని చేపట్టారని చెప్పారు. అనంతరం కస్తాల-తాడువాయి జట్ల మధ్య జరిగిన క్రికెట్ పోటీలో కస్తల టీం, అచ్చంపేట 1- చిగురుపాడు జట్ల మధ్య జరిగిన అచ్చంపేట1 టీం, కొండూరు-తాళ్లచెరువు జట్ల మధ్య జరిగిన పోటీలో తాళ్లచెరువు టీం, మాదిపాడు-కోనూరులమధ్య జరిగిన పోటీలో కోనూరు టీం విజయం సాధించాయి. రిఫరీగా పాఠశాల పీడీ ఆలపాటి సుజాత వ్యవహరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కంబాల వీరబాబు, ఉప సర్పంచ్ జాని, గోపి తదితరులు పాల్గొన్నారు.

ముప్పాళ్లలో...

ముప్పాళ్ళ: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మండలస్థాయి ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు గురువారం జరిగాయి. మొదటి రోజు కబడ్డీ, ఖోఖో, బాడ్మింటన్ విభాగాల్లో పోటీలు జరిగాయి. బాడ్మింటన్ విభాగంలో దమ్మాలపాడు-చాగంటివారిపాలెం జట్లు పోటీ పడగా, దమ్మాలపాడు జట్టు విజయం సాధించింది. మరో మ్యాచ్‌లో నార్నెపాడు-బొల్లవరం జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో నార్నెపాడు జట్టు విజయం సాధించింది. అలాగే నార్నెపాడు, బొల్లవరం, దమ్మాలపాడు జట్లు కబడ్డీ విభాగంలో పోటీ పడ్డారు. పోటీలను వైఎస్సార్ సీపీ నాయకుడు ఎంజేఎం రామలింగారెడ్డి, ఎంపీడీఓ పి.పుట్టారెడ్డి లు ప్రారంభించారు. మ్యాచ్‌లకు వ్యాయామ ఉపాధ్యాయులు ఎస్‌ఎం సుభాని, జి.నరసింహారావు, యు.సత్యవతిలు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.

సత్తెనపల్లిలో..

సత్తెనపల్లి: గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ఆడుదాం ఆంధ్ర' మండల స్థాయి పోటీలు సత్తెనపల్లి మండలంలో ఉత్సాహంగా సాగుతున్నాయి. సత్తెనపల్లి మండలం నందిగామ గ్రామంలో క్రికెట్, కొమెరపూడి గ్రామంలో ఖోఖో పోటీలు గురువారం నిర్వహించారు. నందిగామలో నిర్వహించిన క్రికెట్ మొదటి సెమీఫైనల్ పోటీల్లో పెద్దమక్కెన - భట్లూరు జట్లు పోటీ పడగా భట్లూరు జట్టు గెలుపొందింది. ధూళ్ళిపాళ్ల- కొమెరపూడి జట్లు పోటీ పడగా పలు కారణాలతో ఆటనిలిచిపోయింది. కొమెరపూడిలో నిర్వహించిన ఖోఖో పోటీల్లో నందిగామ-1 - భట్లూరు జట్లు పోటీ పడగా నందిగామ-1 జట్టు విజయం సాధించింది. ఆ జట్టు క్రీడాకారులను మండల చీఫ్ కోచ్ ఆరిక శ్రీరామిరెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

మండల స్థాయి విజేత ముస్సాపురం..

పెదకూరపాడు: రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర పోటీలు మండలస్థాయిలో హోరాహోరీగా సాగుతున్నాయి. పెదకూరపాడు మండలంలోని పెదకూరపాడు, గారపాడు జెడ్పీ పాఠశాలల్లో జరగుతున్న పోటీలను తిలకించేందుకు ప్రజలు భారీగా తరలి వచ్చారు. గురువారం పెదకూరపాడులో జరిగిన కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో ముస్సాపురం గ్రామ సచివాలయం పరిధిలో క్రీడాకారులు మండల స్థాయి విజేతలుగా నిలిచారు. జీఆర్‌సీఆర్‌కె చైతన్య పాఠశాల ఇండోర్ స్టేడియంలో జరిగిన బ్యాడ్మింటన్ ఫైనల్ పోటీల్లో పెదకూరపాడు -3 సచివాలయం జట్టు విజేతగా నిలిచారు. క్రికెట్ పోటీల్లో ముస్సాపురం, పెదకూరపాడు సచివాలయాలు మూడు విజయాలతో ముందున్నారు. ఈ పోటీల్లో ఎంపీడీఓ నరసింహారావు, ఎంఈఓలు ప్రసాదరావు, సత్యనారయణ, పీఈటీలు నాగరాజు, అజయ్, అరుణశ్రీ, నాజర్‌షేక్‌లు పర్యవేక్షించారు.

క్రోసూరులో...

క్రోసూరు: మండల స్థాయి ఆడుదాం-ఆంధ్రా క్రీడాపోటీలు గురువారం ఉత్కంఠభరితంగా జరిగాయి. క్రోసూరు జెడ్పీపాఠశాల ఆవరణలో 30 జట్లు ఆటలు ఆడారు. కబడ్డీ, ఖోఖో, క్రికెట్, వాలీబాల్, బాల్‌బాడ్మింటన్ పోటీలను సచివాలయానికి రెండు జట్లు చొప్పున ఆటలు ఆడారు. మండలంలోని 88త్యాళ్లూరు జెడ్పీ పాఠశాల ఆవరణలో మహిళా జట్లకు క్రికెట్ మ్యాచ్‌లు జరిగాయి. జెడ్పీపాఠశాల పీఈటీ శ్రీధర్ పర్యవేక్షించారు.

సమస్యల పరిష్కారానికి సమన్వయంతో పనిచేయాలి



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య

పెదకూరపాడు: ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య అన్నారు. పెదకూరపాడులోని మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ మీరయ్య అధ్యక్షత నిర్వహించారు. ఈ సందర్భంగా మీరయ్య మాట్లాడుతూ పెదకూరపాడులో తాగునీటి సమస్యలు లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలని, తరచూ మరమ్మతులు లాంటి ఇబ్బందులు వస్తే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. శాశ్వతంగా పరిష్కరించాలన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు నష్టపోయిన రైతుల జాబితాను సిద్ధం చేయాలని తెలిపారు. జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలను వేగవతం చేయాలన్నారు. జెడ్పీటీసీ కంకణాల స్వర్ణకుమారి మాట్లాడుతూ అందుకూరు రోడ్డు మరమ్మతులు నిర్వహించాలని, జలజీవన్ మిషన్‌తో గ్రామాల్లో తాగునీరు కష్టాలు తీరుతాయన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే నంబూరు శంకరరావుల ఆధ్వర్యంలో పెదకూరపాడు మండలం అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. వైస్ ఎంపీపీ షేక్ చాంద్‌బాషా, ఎంపీడీఓ నరసింహారావు, డీటీ నిర్మల లక్ష్మీకుమారి, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తాం

శావల్యాపురం: జిల్లా ఎస్పీ ఆదేశాలు మేరకు సంక్రాంతి పర్వదినం సందర్భంగా కోడిపందేలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని వినుకొండ రూరల్ సీఐ ఉప్పుటూరి సుధాకర్ అన్నారు. గురువారం స్థానిక పోలీసు స్టేషన్ సందర్శించారు. ఈ సందర్భంగా రూరల్ సీఐ మాట్లాడుతూ పేకాట, బెల్ట్ షాపులు, తదితర అసాంఘిక కార్యాకలాపాలపై పోలీసుల నిఘా ఉంటుందన్నారు. చట్ట వ్యతిరేక పనులకు పాల్పడే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. గ్రామాల్లో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి ప్రజలను ఇబ్బందులకు గురిచేసిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో జరిగేలా ప్రజలు తమవంతు సహాయ సహకారాలు అందించాలన్నారు. వినుకొండ రూరల్ బొల్లాపల్లి, ఈపూరు, శావల్యాపురం, నూజెండ్ల మండలాల పరిధిలో ఇరుపార్టీలకు చెందిన కార్యకర్తలు ప్రజాప్రతినిధులపై బైండోవర్ కేసులు నమోదు ప్రక్రియ జరుగుతుందన్నారు. నియోజకవర్గ ప్రజలకు సంక్రాంతి పర్వదినం శుభాకాంక్షలు ముందుస్తుగా తెలిపి అందరు సంతోషకరమైన వాతావరణంలో పండుగ వేడుకలు జరుపుకోవాలన్నారు. ఆయనతో పాటు ఎస్సై టి.తిరుపతిరావు ఉన్నారు.

వినుకొండలో అదనపు కోర్టు ఏర్పాటు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న బార్ అసోసియేషన్ నాయకులు

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలో అదనపు కోర్టు ఏర్పాటు చేయాలంటూ వినుకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చాగంటి వీరాంజనేయ చౌదరి, కార్యదర్శి హనుమంతరావు, ఏజీపీ ఎం.ఎస్.ప్రసాద్, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ కె. చెన్నకేశవరెడ్డి, న్యాయవాది మహమ్మద్ సయ్యద్ ఖాశీంలు లా సెక్రటరీ జి.సత్య ప్రభాకర్‌రావును సెక్రటేరియేట్‌లో కలిసి మెమోరాండం అందజేశారు. అలాగే ఈ విషయమై ప్రభుత్వం వైపు నుండి స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మానాయుడు అడిషనల్ కోర్టు ఆవశ్యకత, ఏర్పాటు గురించి ఇచ్చిన లేఖను కూడా ఇవ్వడం జరిగిందని అసోసియేషన్ నాయకులు తెలిపారు. అదనపు కోర్టు ఏర్పాటులో పూర్తి సహాయసహకారాలు ఉంటాయని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మానాయుడు తెలియజేసినట్లు వారు వివరించారు.